అన్ని వర్గాల అభివృద్ధి కోసం మోదీ కృషి

మన్‌ కీ బాత్‌ కార్యక్రమాన్ని కార్యకర్తలతో కలసి వీక్షించిన కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్‌



పియూష్‌ గోయల్‌తో కలసి వీక్షిస్తున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

సైదాబాద్‌: అన్ని వర్గాల అభివృద్ధి కోసం ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్‌ గోయల్‌ అన్నారు. గతంలో మన్‌ కీ బాత్‌ కార్యక్రమాన్ని పాతబస్తీలో వీక్షించాలని నిర్ణయించుకున్నారు. దీనిలో భాగంగా ఆదివారం భాగ్యనగర్‌ జిల్లా పరిధిలోని నందనవనం ఇస్కాన్‌ టెంపుల్‌ వద్ద బీజేపీ నాయకులు ఏర్పాట్లు చేశారు. దీంతో బీజేపీ భాగ్యనగర్‌ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి కేంద్రమంత్రి ప్రధాని కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాలు మోదీ పాలనలో అభివృద్ధి చెందుతున్నాయని, ప్రపంచంలోనే మోడీకి ఎనలేని కీర్తి ఉందన్నారు. దేశం కోసం ఏదైనా చేయడానికి మోడీ ఎప్పుడు సిద్ధంగా ఉంటాయని, దేశ రక్షణ ఒక్క మోడీకే సాధ్యమన్నారు. ప్రధాని లక్ష్యాలను ప్రేరణగా తీసుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్‌ సుభాష్‌ చందర్జీ, బీజేపీ భాగ్యనగర్‌ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, సైదాబాద్‌ కార్పొరేటర్‌ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అమ్మ జన్మనిస్తే డాక్టర్లు పునర్జన్మనిస్తారు

నాగోలు సుప్రజా హాస్పిటల్‌ ఆధ్వర్యంలో 3కే రన్‌



3కే రన్‌లో ఉప్పల శ్రీనివాస్‌గుప్త, ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న, విజయ్‌కుమార్‌

నాగోలు: అమ్మ జన్మనిస్తే డాక్టర్లు పునర్జన్మనిస్తారని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో–కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్‌ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ ఉప్పల శ్రీనివాస్‌గుప్త, ఎల్‌బీనగర్‌ ఏసీపీ కృష్ణయ్యలు అన్నారు. ఆదివారం జాతీయ డాక్టర్స్‌ డే సందర్భంగా నాగోలు సుప్రజ హాస్పిటల్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ విజయ్‌కుమార్‌ ఆధ్వర్యంలో సుప్రజ హాస్పిటల్‌ నుంచి సాయినగర్‌ స్వాగత్‌ గ్రాండ్‌ హోటల్‌ వరకు నిర్వహించిన 3కే రన్‌ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్‌ గుప్త జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుప్రజ హాస్పిటల్‌ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్లు కొవిడ్‌ సమయంలో చేసిన సేవ వెలకట్టలేనిది అని వారి సేవలు కొనియాడారు. వ్యాయామానికి ఇలాంటి రన్‌ నిర్వహించాలి అని ఫిట్నెస్‌తో అందరూ వుండాలని, ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరిగా చేయాలని ఆయన సూచించారు. అనంతరం డాక్టర్లను శాలువాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్‌ నగర్‌ ఏసిపి కృష్ణయ్య, ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న, బాగ్యలక్ష్మి ,ఎక్సైజ్‌ ఏసిపి గణేష్‌, డాక్టర్‌ చిట్టిపాక శ్రీని వాస్‌, విజయ్‌ డాక్టర్స్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వైద్యులు దైవంతో సమానం

తెలంగాణ ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్‌ చిన్నారెడ్డి



కార్డియాలజీ విభాగాన్ని ప్రారంభిస్తున్న చిన్నారెడ్డి

సైదాబాద్‌: వైద్యులను దైవంగా భావించి వచ్చే రోగులకు ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ చైర్మన్‌ చిన్నారెడ్డి సూచించారు. కేవలం ప్రభుత్వ ఆసుపత్రులే కాకుండా ప్రైవేట్‌, కార్పొరేటర్‌ హాస్పిటళ్లు కూడా సామాజిక సేవలను కొనసాగించాలని ఆయన అన్నారు. ఆదివారం చంపాపేటలోని ఓనస్‌ రోబోటిక్‌ మల్టీస్పెషల్‌ హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఓనస్‌ హార్ట్‌ ఇనిస్టిట్యూట్‌, కార్డియాలజీ విభాగాన్ని ఆయన పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఓనస్‌ హాస్పిటల్‌ అత్యాధునిక పరిజ్ఞానంతో, నూతన సాంకేతిక పరికరాల సహాయంతో సమర్థవంతమైన సేవలు అందిస్తూ రోగులకు స్వస్థత అందించి వారి మన్ననలు పొందటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ అనురాధ, కార్పొరేటర్‌ మధుసూదన్‌రెడ్డి, ఓనస్‌ హాస్పిటల్‌ ఎండి డాక్టర్‌ బాలరాజు నాయుడు, కార్డియాలజీ విభాగం సీనియర్‌ డాక్టర్‌ లక్కిరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారులో గంజాయి సరఫరా..



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి



పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు సురేష్‌

- పాత నేరస్తుడు అరెస్టు..
- 31.2 కేజీల గంజాయి స్వాధీనం

నాగోలు: ఖమ్మం నుంచి నిజామాబాద్‌కు అక్రమంగా కారు గ్యాస్‌ ట్యాంక్‌లో గంజాయి దాచి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట నేరస్తుడిని నాగోలు, ఎల్‌బీనగర్‌ ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి 31.2 కేజీల గంజాయిని, మారుతి కారు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నాగోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని కృష్ణ జిల్లా, విజయవాడ రూరల్‌, పైడూరుపాడుకు చెందిన బోయినిపల్లి సురేష్‌ (35) డైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడు గతంలో భద్రాచలంలో గంజాయి కేసులో అరెస్టు అయ్యాడు. సురేష్‌ ఇటీవల ఖమ్మంలో గంజాయి వ్యాపారి, పాత నేరస్తుడితో పరిచయం ఏర్పడింది. దీంతో సులభంగా డబ్బు సంపాదించడానికి గంజాయిని రవాణా చేయ మని సూచించాడు. ఈ క్రమంలోనే మారుతి 800 కారును తీసుకుని అందులో పోలీసుల తనిఖీ చిక్కకుండా నిందితులు గంజాయి ప్యాకెట్లను సీఎన్‌జీ గ్యాస్‌ ట్యాంక్‌లో ప్రత్యేకంగా తయారు చేయించి దాచి వెళ్తున్నాడు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్‌ ఎస్‌ఓటీ , నాగోలు పోలీసులు ఆదివారం తెల్లవారుజామున కారులో గంజాయిని తరలిస్తున్న వ్యక్తి అరెస్టు చేసి అతని వద్ద నుంచి 32.1 కేజీల గంజాయి, ఫిట్నెస్‌ లేని మారుతీకారు, ఒక మొబైల్‌ ఫోను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు సురేష్‌ను అరెస్టు చేసి విచారణ చేయగా ఈ కేసులో మరో ముగ్గురు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు న లుగురిపై కేసు నమోదు చేసుకుని పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నాయులు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ పోషణలో మేము సైతం..!

ఒక చేత్తో ఇంటి పని.. మరో చేత్తో వృత్తి పని

- లక్ష్మీ నర్సింహ్మా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో పదేళ్లుగా మహిళలకు శిక్షణ
- టీవీలకు అతుక్కపోకుండా ఇంటి బాధ్యతలో భాగస్వామ్యం
- చేతి వృత్తులతో ఉపాధి పరిమళాలు
- మహిళా ఆర్థిక స్వావలంబనతో ఎనలేని ఆత్మస్థైర్యం



స్కూల్‌ యూనిఫాంలు కుడుతున్న స్త్రీ శక్తి డ్వాక్రాగ్రూప్‌ మహిళలు

చంపాపేట: మహిళలను ఉద్దరించటానికి నీవెవరు...వారికి చదువు, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఇస్తే ఈ సమాజం తల రాతను ఇట్టే మార్చే సత్తా వారి ఉందని స్వామి వివేకానంద మాటల్ని అక్షరాలా నిజం చేస్తున్నారు ఈ మహిళామణులు. చేతి వృత్తులను కాలక్షేపం కోసమో...హాబీగానో నేర్చుకుని మగవారికి ఏమాత్రం తీసిపోమని ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. ఇంటి పనిని ఓచేత్తో...శిక్షణ పొందిన వృత్తి పనిని మరో చేతితో నడిపిస్తూ పురుషులతో సమానంగా కుటుంబ పోషణలో భాగస్వాములు అవుతున్నారు. చంపాపేట డివిజన్‌ నెహ్రూనగర్‌ కాలనీలో గత పది సంవత్సరాలుగా స్త్రీ శక్తి డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు వరలక్ష్మి ఆధ్వర్యంలో లక్ష్మీ నర్సింహ్మా ఫౌండేషన్‌ పేరిట గృహిణుల తీరిక సమయాలలో చేతి వృత్తులపై ఉచితంగా శిక్షణ ఇస్తూ అక్కడే వారికి ఉపాధి కల్పిస్తున్నారు. ప్రతీఏట సుమారు రెండు వందల మంది మహిళలు చేతి వృత్తులపై శిక్షణ పొంది తమ నైపుణ్యతను ప్రదర్శిస్తున్నారు. తీరిక సమయాలలో ఇంట్లో ఖాళీగా కూర్చోవటమో...టీవీకి పరిమితం కావటమో కాకుండా కుటుంబ పోషణలో భాగస్వాములు కావాలనే తపనతో చేతి వృత్తులను అవపోసన పడుతున్నారు. వీరంతా ఒకవైపు ఇంటి పని చేస్తూనే మరోవైపు కుటుంబ ఎదుగుదల కోసం పాటుపడుతున్నారు. ఉదయం లేవగానే ఇంటిపని పూర్తిచేసి పిల్లలను బడికి పంపి క్షణం తీరిక తీసుకోకుండా శిక్షణా కేంద్రానికి పరుగులు పెడుతున్నారు. మరి కొందరు టీనేజీ అమ్మాయిలు చదువు కుంటూనే చేతి వృత్తులపై శిక్షణ పొంది తల్లి దండ్రులపై ఆధారపడకుండా రవాణా, ట్యూషన్‌, పుస్తకాలు, ఇతర స్టేషనరీ ఖర్చులు వారే సంపాదిస్తూ ఆర్థిక స్వాలంబన సాధిస్తున్నారు. కుట్టు మిషన్‌, చీరలపై పెయింటింగ్స్‌, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్‌, పాట్‌ డిజైనింగ్‌ వంటి చేతివృత్తులపై శిక్షణ పొంది నెలకు రూ.12 వేల నుంచి 18 వేల వరకు సంపాదించగలుగుతున్నారు.

ప్రభుత్వం చేయూతనివ్వాలి...



పది సంవత్సరాల క్రితం ఉచిత శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. శిక్షణ పొందిన మహిళలకు ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఉపాధి కూడా కల్పిస్తున్నాం. ప్రతీ ఏట మే మాసం నుంచి మూడు నెలలపాటు విరామం లేకుండా స్కూల్‌ యూనిఫాంలు కుట్టుతున్నాం. ప్రభుత్వం యూనిఫాంలు కుట్టే బాధ్యత డ్వాక్రా గ్రూప్‌ మహిళలకు అప్పగిస్తామని ప్రకటన చేయటంతో సంతోష పడ్డాం. కానీ అది క్షేత్రస్థాయిలో జరగటం లేదు. సంబంధిత అధికారులు యూనిఫాంలు కుట్టే బాధ్యత కొన్ని సొసైటీలకు అప్పగిస్తు న్నారు. దీంతో మాకు సంవత్సరం పాటు చేతినిండా పనిలేకుండా పోతోంది. అధికారుల పని తీరు మా ఆశలపై నీళ్ళు చల్లినట్లు అయింది.

వరలక్ష్మి, స్త్రీ శక్తి
డ్వాక్రా గ్రూప్‌ అధ్యక్షురాలు, చంపాపేట

నాలో ఆత్మస్థైర్యం పెరిగింది



ఇంట్లో తీరిక సమయాలలో ఖాళీగా కూర్చోవటం ఎందుకని కుట్టు మిషన్‌ వృత్తిపై శిక్షణ పొందా. ముందుగా బ్లౌజ్‌లు, లంగాలు కుట్టేదన్ని. అంతో ఇంతో ఆదాయం రావటంతో ఇదే వృత్తిగా చేపట్టా. రోజులో తీరిక సమయాలలో కుట్టు మిషన్‌ వృత్తిపై రూ.12 వందల నుంచి రూ. 15 వందల వరకు సపాదిస్తున్నా. దీంతో నాలో ఆత్మస్థైర్యం పెరిగింది.

జయంతి, కలకోనికుంట

స్వయం ఉపాధి పొందుతున్నా



కుట్టు మిషన్‌ వృత్తిపై శిక్షణ పొందా. మంచి నైపుణ్య వచ్చింది. చేతినిండా ఆదాయం వస్తోంది. పిల్లలను మంచి ప్రైవేట్‌ పాఠశాలలో చేర్పించా. కుటుంబ పోషణలో భాగస్వామ్యం కావటం సంతృప్తికరంగా ఉంది. చేతివృత్తులపై శిక్షణ పొందిన వారిని ప్రభుత్వమే గుర్తించి వారందరినీ ఒకే వేదికపై తెచ్చి చేతివృత్తుల ఆధార కుటీర లేక మధ్యతరహా పరిశ్రమ ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తే మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి కుటుంబ పోషణలో భాగస్వాములవుతారు.

లక్ష్మీ, చంపాపేట

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నాగోలు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్‌ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. ఇంటర్నేషనల్‌ వైశ్య ఫెడరేషన్‌ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగ ఆధ్వర్యంలో కొత్తపేటలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రీ అనుగ్రష్టమి అనుఘా దేవి దత్తవ్రతం మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల శ్రీనివాస్‌ గుప్త, ఐవీఎఫ్‌ సెంట్రల్‌ అడ్వైజరీ బోర్డ్‌ చైర్మన్‌ గంజి రాజమౌళి గుప్త పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



ఎల్‌బీనగర్‌: ఉచిత కంటి పరీక్ష శిబిరం హరిహర పురం కాలనీలో ఏర్పాటు చేయడం సంతోషకరమని బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం బీఎస్‌రెడ్డి నగర్‌ డివిజన్‌ పరిధిలోని హరిహరపురం కాలనీలో శ్రీసాయినేత్రాలయ కంటి ఆసుపత్రి ఎండీ డాక్టర్‌ సంతోష్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి కార్పొరేటర్‌ లచ్చిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలోని ప్రజలందరూ ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్‌ అధ్యక్షులు హన్మంతరెడ్డి, కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు శంకర్‌గౌడ్‌ సీనియర్‌ సిటిజన్స్‌ అధ్యక్షులు స్వతంత్రరెడ్డి, సంజీవరెడ్డి, డి. రాములు, చేనేత మోర్చా కన్వీనర్‌ రఘురాం నేత తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ



పదవీ విరమణ పొందిన కండక్టర్లు, డ్రైవర్లను సత్కరిస్తున్న డీపో మేనేజర్‌ హరి

చైతన్యపురి: ఆర్‌టీసీ దిల్‌సుఖ్‌నగర్‌ సిటీ డిపోలో ఆదివారం నలుగురు ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిపో మేనేజర్‌ హరి ముఖ్యఅతిథిగా పాల్గొని పదవీ విరమణ పొందుతున్న కండక్టర్లు ఎంబి నారాయణ, బి.యాదయ్య డ్రైవర్లు కె.బిక్షమయ్య, డి.పెద్దులులకు శాలువా కప్పి బొకేతో సత్కరించారు. శేష జీవితంలో కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని డీఎం అన్నారు. ఇంతకాలం సంస్థ అభివృద్ధికి పాటుపడినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకన్న డిపో సిబ్బంది, పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

దేవస్థానం బాధ్యతలు అప్పగింత



బాధ్యతలను వీర శైవ లింగాయత్‌ సమాజం పూర్వ కమిటీకి అప్పగిస్తున్న శాంత్‌కుమార్‌

వనస్థలిపురం: వనస్థలిపురం ఫేజ్‌–1లోని శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం బాధ్యతలను ఆదివారం నుంచి వీర శైవ లింగాయత్‌ సమాజం పూర్వ పాలకమండలి స్వీకరించింది. 2014 నుంచి 2024 జూన్‌ వరకు దేవస్థానం కమిటీ అధ్యక్షుడిగా ఉన్న మఠం శాంత్‌కుమార్‌ తన పదవీ కాలం ముగియడంతో బాధ్యతలను సమాజం పూర్వ కమిటీకి అప్పగించారు. పూర్వ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శాంతప్ప, రవీంద్రనాధ్‌ ఆదివారం నుంచి దేవస్థానం బాధ్యతలను స్వీకరించారు. త్వరలోనే దేవస్థానానికి సంబంధించి నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీర శైవ లింగాయత్‌ సమాజం ప్రతినిధులు దీపావళి శ్రవణ్‌ కుమార్‌, చౌదరి దివాకర్‌ లింగం, వీరప్ప, శ్రీశైలం, గౌరి, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

పనామా చౌరస్తాలో ఫ్లైఓవర్‌ను మాత్రమే నిర్మించాలి



వనస్థలిపురంలో పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ కార్పొరేటర్లు

వనస్థలిపురం: వనస్థలిపురం పనామా చౌరస్తా వద్ద ప్రజలకు ఇబ్బందులు కలిగించే అండర్‌పాస్‌ (మట్టి బ్రిడ్జి) నిర్మాణం వద్దని, ఫ్లైఓవర్‌ను మాత్రమే నిర్మించాలని బీఆర్‌ఎస్‌ మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి జీ.వీ.సాగర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో వారు మాట్లాడారు. విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు తమకు సమ్మతమే కానీ, పనామా వద్ద అండర్‌పాస్‌ నిర్మాణం వల్ల రెండు వైపులా గోడలు వచ్చి అటు, ఇటు ఉన్న వ్యాపార సముదాయాలు మూసుకుపోతాయని అన్నారు. వనస్థలిపురం అనుసంధానంగా వందలాది కాలనీలు ఉన్నాయని, అండర్‌పాస్‌ నిర్మాణంతో కాలనీలకు వెళ్లడానికి యూటర్న్‌ సమస్యలు వస్తాయని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే ఉన్నా ఈ విషయంలో స్థానిక బీజేపీ కార్పొరేటర్లు పనులను అడ్డుకోలేకపోతున్నారని వారు అన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో నగరంలో అందమైన ఫ్లైఓవర్లు నిర్మాణం జరుపుకున్నాయని, ఇక్కడ కూడా ఫ్లైఓవర్‌ను నిర్మించాలని వారు డిమాండ్‌ చేశారు. లేనట్లయితే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని అన్నారు.

నాగోలు సీఐగా సుధీర్‌కృష్ణ బాధ్యతలు



సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుధీర్‌కృష్ణ

నాగోలు: నాగోలు పోలీస్‌ స్టేషన్‌ నూతన సీఐగా ఎస్‌. సుధీర్‌ కృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ పరుశురాం రాచకొండ సీపీ కార్యాలయంలో అటాచ్‌ చేసిన విషయం తెలిసిందే. 2009 బ్యాచ్‌కు చెందిన సుధీర్‌కృష్ణ రాచకొండ పరిధిలో వివిధ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో పనిచేశారు. బాలాపూర్‌, కీసర, డీఐగా, మల్కాజిగిరి ట్రాఫిక్‌ సీఐగా, భువనగిరి టౌన్‌ సీఐగా, పహాడీ షరీఫ్‌ డీఐగా పనిచేసిన ఆయన నాగోలు సీఐగా బదిలీపై వచ్చాడు. ఈ సందర్భంగా నూతన సీఐ బాధ్యతలు స్వీకరించిన సుధీర్‌కృష్ణ మాట్లాడుతూ నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శాంతి భద్రత పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

కాలనీ వాసుల సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తా

కొత్తపేట కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌



కమ్యూనిటీ హాల్‌ వద్ద మంచినీటి కనెక్షన్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ పవన్‌కుమార్‌

నాగోలు: కాలనీవాసుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని కొత్తపేట డివిజన్‌ కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌ అన్నారు. ఆదివారం కొత్తపేట డివిజన్‌ రాజీవ్‌ గాంధీనగర్‌ ఫేస్‌ 2లో పర్యటించారు. ఈ సందర్భంగా గతంలో కాలనీ అసోసియేషన్‌ కమ్యూనిటీ హాల్‌లో ప్రజల అవసరాల మేరకు నీటి వసతి కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన కార్పొరేటర్‌ పవన్‌కుమార్‌ సొంత నిధులతో మంచి నీటి కనెక్షన్‌ ఇప్పించి ఆదివారం కాలనీవాసుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అందరూ కలసి తాగునీటి వసతి కల్పించినందుకు, కాలనీలో ఎన్నో సంవత్సరాల నుంచి సరైన డ్రైనేజీ లైన్‌ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బంది పడుతుంటే అధికారుల వెంట పడి మరీ ప్రజల సంక్షేమం కోసం నూతన డ్రైనేజీ లైన్‌ వేయించినందుకు కాలనీవాసులు కార్పొరేటర్‌ పవన్‌కుమార్‌ ధన్యవాదాలు తెలియజేశారు, అనంతరం కాలనీలోని రోడ్డు సమస్యలను పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు సమస్య కూడా తీరేలా చూస్తామని కాలనీవాసులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు స్వామి, దుర్గేష్‌, కిషన్‌, రాజు, లడ్డు, నాగరాజు, సత్యం, మారమ్మ, లక్ష్మి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో పార్కు పనులను పరిశీలించిన కార్పొరేటర్‌ పవన్‌కుమార్‌

కొత్తపేట డివిజన్‌లోని ఎస్‌ఆర్‌ఎల్‌ కాలనీలోని తెలంగాణ పార్కులో ఆదివారం ఉదయం కార్పొరేటర్‌ పవన్‌కుమార్‌ మర్నింగ్‌ వాక్‌ నిర్వహించారు. పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను కాలనీ వాసులతో చర్చించారు. హెచ్‌ఎండిఏ, జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులకు సంప్రదించి పార్కు అభివృద్ధి త్వరగా పూర్తి అయ్యేలా చూస్తానని తెలిపారు. పార్కులో వాకింగ్‌ చేసే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పార్కును శుభ్రంగా వుండేలా చూడాలని శానిటైజేషన్‌ సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు విజయ్‌ భాస్కర్‌, లక్ష్మీ రాజం, ప్రభాకర్‌, మధుసూధన్‌ రావు, జగన్‌రెడ్డి, చిరంజీవి, ప్రేమ్‌ తదితరులు పాల్గొన్నారు.



పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ ఫ్లోర్‌ లీడర్‌ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి..

అందరి కృషితోనే కాలనీల్లో పరిశుభ్రత సాధ్యం

లింగోజిగూడ: కాలనీలో పరిశుభ్రత పాటించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్‌ పార్టీ ఫ్లోర్‌ లీడర్‌, లింగోజిగూడ డివిజన్‌ కార్పొరేటర్‌ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి కోరారు. డివిజన్‌ పరిధిలోని మసీద్‌ గల్లీలో శానిటేషన్‌ సిబ్బంది, మన్సూన్‌ సిబ్బంది, వాటర్‌ వర్క్స్‌ మ్యానువల్‌ క్లినింగ్‌ సిబ్బందితో కలిసి పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్‌ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్పల్లి రాజశేఖర్‌ మాట్లాడుతూ కాలనీలో చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయకుండా జీహెచ్‌ఎంసి రిక్షా, ఆటోలకు తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు. చెత్తను రోడ్డుమీద వేయడం వల్ల కాలనీవాసులకు వ్యాధులు ప్రబలి అనారోగ్యాలకు గురవుతారని అన్నారు. డివిజన్‌ పరిధిలోని అన్ని కాలనీలలో ప్రత్యేక డ్రైవ్‌ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి చెత్త వేయకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. దానికి కాలనీ సంక్షేమ సంఘాలు కాలనీ సభ్యులు సహకరించాలన్నారు. చేయిచేయి కలిపితేనే పరిశుభ్రత సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్‌ డీఈ వెంకటేశం, సూపర్‌వైజర్లు, సంజీవ్‌, యాదగిరి, సత్యానారాయణ, రాజు, ఉపేందర్‌, కాంగ్రెస్‌ పార్టీ లింగోజిగూడ డివిజన్‌ అధ్యక్షుడు పలుసం శ్రీధర్‌ గౌడ్‌, జైపాల్‌ రెడ్డి, భాను గోపి, రబ్బాని, షఫి, జీవన రెడ్డి, రాము గౌడ్‌, ప్రవీణ్‌ రెడ్డి, కరుణ్‌, రోహిత్‌, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.